

నేడు సీఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి -రేణిగుంట తిరుపతి పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుండి ఆర్. సి. ఆర్ కళ్యాణ మండపానికి రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఐపిఎస్., ఆధ్వర్యంలో రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఆర్.సి.ఆర్ కళ్యాణ మండపం వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. రేణిగుంట విమానాశ్రయం నుండి పరిసరాలలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని కోణాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి పాల్గొన్నారు.



భూ సమస్యలకు 'న(ర)క్ష'

ఆస్తిపన్ను, అక్రమ కట్టడాలకు చెక్
నగరమంతా ఏడాది పాటు డ్రోన్ సర్వే
రాష్ట్రంలో 10 కార్పొరేషన్లలో అమలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ భూ సమస్యలకు 'చెక్' పెట్టేందుకు 'నక్ష' డ్రోన్ సర్వేను ఏడాది పాటు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకుగాను రాష్ట్రంలో 10 కార్పొరేషన్లను ఎంపిక చేసింది. ఆస్తిపన్ను విధింపు, అక్రమ కట్టడాలకు చెక్ పెట్టేందుకు, అత్యధికంగా ఉన్న భూవివాదాలను పరిష్కరించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ ప్రభుత్వ హయాంలో భూ సర్వేలు జరుగుతూనే ఉన్నాయి. 'కూటమి' హయాంలో చేపట్టిన ఈ 'నక్ష' (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జి బేస్డ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) సర్వే ఎవరికి 'రక్ష'గా ఉంటుందనేది వేచి చూడాల్సిందే. తాజాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కొంతమంది వైసిపి కార్పొరేటర్లకు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని తేల్చారు. కండువా మార్చుకోగానే అవి సక్రమమైపోయాయేమో మరి. 'నక్ష' మరి ఎవరికి 'రక్ష'గా ఉంటుందో మరి.

తిరుపతి నగరం 75 సంవత్సరాల క్రితం కుగ్రామం. రానురాను కార్పొరేషన్‌గా విస్తరించింది. 1932లో తిరుపతి జనాభా దాదాపు వెయ్యి మంది ఉండేవారు. అప్పట్లో 400 గృహాలు ఉండేవి. ప్రస్తుత నగర జనాభా 4 లక్షల మంది. 75వేలకు పైగా గృహాలు ఉన్నాయి. నగరం రోజురోజుకూ విస్తరిస్తుండడంతో భూ సమస్యలు అధికంగానే ఉన్నాయి. ముఖ్యంగా తిరుపతిలో దేవాదాయ, మఠం భూములు ఎక్కువగా ఉన్నాయి. నగరంలోని 48 చెరువుల్లో అత్యధిక భాగం ఆక్రమణకు గురయ్యాయి. కాల్వలు, కుంటలు, బావులు, డికెటి, ప్రభుత్వ భూములు కబ్జా అయిపోవడంతో చిన్న స్థలం కొనాలన్నా కోట్లల్లో రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అది కూడా వివాదాస్పద స్థలాలు నగరంలో ఎక్కువగానే ఉన్నాయి. తాజాగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ భూ సమస్యలు కోకొల్లలుగా వచ్చాయి.

అధికారులు ఏం చెబుతున్నారంటే..?

తిరుపతితోపాటు విశాఖ, విజయవాడ, గుంటూరు, కర్నూలు, కడప, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, అనంతపురం పట్టణ కార్పొరేషన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం 'నక్ష' పేరుతో సర్వే చేపట్టనుంది. భూవివాదాలను పరిష్కరించడంలో సహాయపడుతుందని, ఆస్తి రికార్డులను క్రమబద్ధీకరిస్తుందని, పట్టణ ప్రణాళికను మెరుగుపరుస్తుందని అధికారులు చెబుతున్నారు. పారదర్శకత, సామర్థ్యం, స్థిరమైన అభివృద్ధి ఉంటుంది. ఆస్తిపన్ను విధింపులు హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా పన్నులు వేసేందుకు వీలవుతుంది. ఖాళీ స్థలాలు కొనుగోలు చేసేవారు మోసపోకుండా ఉండేందుకు రికార్డులు ఉపయోగపడతాయి. డబుల్ రిజిస్ట్రేషన్ నివారించవచ్చు. కొత్తగా నిర్మించే కట్టడాలకు ఆస్తిపన్ను వేయాలంటే గతంలో 2డి, 3డి కెమెరాలు వాడేవారు. వాటిలో భవనం సరిగ్గా కనబడేది కాదు. కొలతలు హెచ్చుతగ్గులు ఉండేవి. నక్ష సర్వేలో డ్రోన్‌తో సర్వే చేసి సరైన కొలతలు వేస్తారు. దీంతో పక్కా కొలతలు ఉంటాయని చెబుతున్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సెట్టిపల్లి, యర్రరెడ్డిపాళెం, 22(ఎ) భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమో వేచి చూడాల్సిందే.

సర్వేకు సహకరించండి : మౌర్య, కమిషనర్

తిరుపతిలో త్వరలో నక్ష సర్వే జరుగుతుంది. ప్రజలు ఈ సర్వేకు సహకరించాలి. ఈ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కరించబడటమే గాకుండా, కొత్త భూరికార్డులు తయారు చేసుకునే వీలుంది. నగరంలో చాలా భూములకు రికార్డులు సరిగ్గా లేవు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే నక్ష సర్వే ద్వారా గుర్తించవచ్చు. భూ సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశం ఉంది. ఆస్తిపన్నుల విధింపుల్లోనూ అవకతవకలు జరగకుండా ఉంటుంది. మఠం, ఇనాం, డికెటి, కాల్వ, చెరువులు, కుంటలు సక్రమంగా గుర్తించే అవకాశం ఉంది.



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎంపి, కలెక్టర్, కమిషనర్ (ఫైల్‌ఫోటో)

8 నుంచి తుడా టవర్స్‌కు వేలం : ఎన్.మౌర్య



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తుడా ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తుడా టవర్లకు మార్చి 8వ తేదీ నుంచి వేలం నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ రాయలచెరువులోని తుడా టవర్స్ అందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 13 అంతస్తుల్లో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్తుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో ఆఫీసుల వినియోగానికి ఉపయోగిస్తామన్నారు. మిగిలిన అంతస్తుల్లో నివాసయోగ్యంగా 2, 3, 4 బెడ్‌రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తున్నామన్నారు. నివాసాలకు 230 ఫ్లాట్లు ఉంటాయన్నారు. 46 డబుల్, 152 త్రిబుల్, 32 నాలుగు బెడ్‌రూమ్ ఫ్లాట్లు ఉంటాయన్నారు. విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. వాణిజ్య సముదాయాలు, ఫ్లాట్లకు వేర్వేరుగా లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2026, మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మార్చి 8 వ తేదీ 2,3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10 వ తేదీ 6, 7 అంతస్తులకు, 11 వ తేదీ 8,9 అంతస్తులకు, 12 వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుండి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య ఉన్నారు.

బహిరంగ మూత్రవిసర్జన చేపడితే చర్యలు

నగరంలో బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా, జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలో చిన్నబజారువీధి, చింతకాయలవీధి, రామచంద్రపుష్కరిణి, పల్లివీధి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున పారిశుధ్య పనులను పరిశీలించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పెండింగ్ ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, ప్రాజెక్టుల ప్రతినిధులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ లో భాగంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై శనివారం ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కింద జరుగుతున్న అభివద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని అన్నారు. గరుడ వారధిలో కూడళ్ళ, డివైడర్లు, గోడల సుందరీకరణ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు చంద్రశేఖర్, శ్యాంసుందర్, డి.ఈ.లు మహేష్, మధు, ప్రసాద్, ఏ.ఓ. రాజశేఖర్, సి.ఎఫ్.ఓ. మల్లికార్జున, ఏ ఈ కాం ప్రతినిధులు బాలాజీ, అనిల్, అఫ్కాన్స్ ప్రతినిధి స్వామి, ఐ ట్రిపుల్ సి, మల్టి లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుల ప్రతినిధులు ఉన్నారు.

తారు ప్యాచ్ వాహనం కొనుగోలు చేయాలి

కార్పొరేషన్ పరిధిలో తారు రోడ్డు గుంతలు పడినపుడు ప్యాచ్లు వేసేందుకు ఒక వాహనాన్ని కొనుగోలు చేయాలని కార్పొరేటర్ ఎస్‌కె బాబు కమిషనర్ ఎన్.మౌర్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలోనూ ఎన్నోమార్లు విన్నవించామన్నారు. స్మార్ట్‌సిటీలో బండి తోసుకుని సిబ్బంది వెళుతుంటే బాధగా ఉందని, సిబ్బంది కొరతగా ఉందని పేర్కొన్నారు.

మఠం భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కూటమి హయాంలో కోట్ల విలువైన మఠం భూమి అన్యాక్రాంతం అవుతుందని, వైసిపి కార్పొరేటర్లకు ఎరచూపి కోట్ల విలువైన భూమి కబ్జా చేస్తుంటే అధికార యంత్రాంగం దాసోహం అయినట్లుగా వ్యవహరిస్తుందని వైసిపి పట్టణ అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి విమర్శించారు. వైసిపి హయాంలో వారి దందాను మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నామని, నేడు కూటమి అండ చూసుకుని కేశవాయనగుంట సర్వే నంబర్ 57లో మఠానికి సంబంధించిన 250 అంకణాల స్థలాన్ని కబ్జా చేశారన్నారు. ఉదయవంశీ, వాసుయాదవ్ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తూ...

'ఆప్కాస్'ను కొనసాగించాలని వినతి

వెంకటగిరి టౌన్ : ఆప్కాస్ రద్దు వద్దని, ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించరాదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి, దళారీ వ్యవస్థను తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ఆప్కాస్ రద్దు చేసి కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే విధానం మానుకోవాలని, ప్రస్తుతం ఆప్కాస్‌లో ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అత్యవసర సేవల ద్వారా తమ ప్రాణాలను పణంగాపెట్టి విషవాయువుల మధ్య ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నారన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్‌చేసే విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. 24న సిఎం చంద్రబాబుకు లేఖలు రాయడం, ఫిబ్రవరి 18న ఆర్డీవోలకు, మార్చి 1న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. 5వ తేదీ విజయవాడలో జరిగే మహాధర్నాలో పాల్గొంటామన్నారు. 6వ తేదీ ఇంజినీరింగ్ కార్మికులతో మహాధర్నా విజయవాడలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.ప్రసాద్, వి.పెంచలయ్య, సుబ్రమణ్యం,రమణయ్య, హరిబాబు, ఇందిరమ్మ, శుభరత్నమ్మ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడాలి: రత్న కుమార్

తిరుపతి(మంగళం): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు వంత పాడుతూ కార్మికుల హక్కులను ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని ఐఎన్‌టియుసి తిరుపతి,చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఉమ్మడి అధ్యక్షులు లేబూరి రత్నకుమార్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఏనాడో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు వెలువరించిందని, నేటికీ ఈ తీర్పు అమలు కాకపోవడంతో టీటీడీలు, వివిధ యాజమాన్యాలలో కార్మికులు చాలీచాలని వేతనంతో బతుకు జీవనం సాగిస్తున్నారని అన్నారు. కార్మికుల విధివిధానాలలో మార్పులు తీసుకురావాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకొవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఐఎన్టియుసి కార్మిక సంఘ విస్తరణలో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లి టౌన్ ప్రెసిడెంట్ గా షేక్ ఆరిఫ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబా జుబేర్ ను నియమిస్తూ నియామక పత్రాలను వారికి అందించారు.

'భవిత'లో పిల్లల భవిష్యత్ మారాలి : డిఇఒ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తును ప్రగతి పథం దిశగా నడిపించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి ఐఈఆర్‌టి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో పిల్లల నమోదును పెంచుకోవాలని సూచించారు. భవిత కేంద్రాలకు హాజరయ్యే పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. అభం, శుభం తెలియని పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని అన్నారు. ప్రతి మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరికీ భవిత కేంద్రాల ద్వారా అవసరమైన సేవలు అందించాలని సూచించారు. వైకల్యం కలిగిన పిల్లలకు సదరం సర్టిఫికెట్లు అందించేందుకు ఐఆర్టీలు తమ వంతు కషి చేయాలని కోరారు. ఐఈఆర్టీలందరూ అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంవో శివశంకరయ్య, ఏఏఎంవో మధు, ఎంఈఓ లు భువనేశ్వరి, బాలయ్య హెచ్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'బిసి కార్పొరేషన్'కు 534 దరఖాస్తులు

ప్రజాశక్తి- రేణిగుంట రేణిగుంట మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కొరకు 534 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎంపీడీవో కార్యాలయం లో మండలంలోని కెనరా బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరి బ్యాంకు మొత్తం ఏడు బ్రాంచ్ల అధికారులు లబ్దిదారుల దరఖాస్తులను ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూ నిర్వహించారు. 534 మంది దరఖాస్తు చేయగా 350 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఏవో పిచ్చి రెడ్డి తెలిపారు.

నేడు ఏపీపీఎస్సీ గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ ఆదివారం 23వ తేదీ జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్- 2 మెయిన్స్ నిర్వహణ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముఖ్య పర్యవేక్షణ అధికారులను, ఇన్విజిలేటర్ లను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలకు జాయింట్ కలెక్టర్ ఓవరాల్ ఇంచార్జిగా ఉంటారన్నారు. పరీక్షల కోసం అవసరమైన స్టేషనరీని చెక్ లిస్ట్ ప్రకారం సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. జిల్లా నందు పరీక్షలు నిర్వహించే 13 పరీక్షా కేంద్రాలలో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గ్రూప్ -2 పరీక్షలు పేపర్ -1 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్ -2 మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పేపర్ -1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8:30 గంటల నుంచి 9.30 గంటల లోపు చేరుకోవలసి ఉంటుంది. పేపర్ -2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం 1.30 నుండి 2.30 వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉంటుందని, అదనంగా గ్రేస్ పిరియడ్ ఉదయం, మధ్యాహ్నం 15 నిమిషాలు వరకు మాత్రమే ఉంటుంది.

తాగునీటి పైప్‌లైన్ పరిశీలన

రోడ్డు వేసేందుకు డిప్యూటీ మేయర్ హామీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుపతి 44వ డివిజన్ ఎఎస్ఆర్ కాలనీలో డ్రైనేజీ నీళ్ల కలిసి కలుషితం అవుతున్న తాగునీటి పైప్‌లైన్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విజ్ఞప్తి మేరకు డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ నారాయణ శనివారం ఉదయం పరిశీలించారు. డ్రైనేజీ నీరు కలిసి తాగునీరు కలుషితం అవుతుంటే ముందు డ్రైనేజీ క్లియర్ చేయకుండా నీటి పనులు చేపట్టడం ఏంటని కాంట్రాక్టర్‌ను, సిబ్బందిని ప్రశ్నించారు. నీటిపైపులైను కోసం తవ్విన కాల్వలో డ్రైనేజీ మురుగునీరు నిండి ఉండటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, ఈ వ్యవస్థను బాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్‌ను, సంబంధిత డిప్యూటీ ఇంజినీర్‌ను పిలిపించి మాట్లాడారు. డ్రైనేజీ పైప్‌లైన్ కూడా వేసి, రోడ్డును కొత్తగా వేయాలని ఆదేశించారు. కార్పొరేటర్‌కు తెలియకుండా పనులు చేయడం సరికాదని కార్పొరేటర్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టిమేషన్లు తయారు చేసి పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లికార్జునరావు, నరేంద్ర, గంగులప్ప, గురుప్రసాద్, టిడిపి నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, రవినాయుడు, మున్సిపల్ సిబ్బంది నామని, కాంట్రాక్టర్ గోపాల్, కాలనీవాసులు భారతి, బాలాజీ, అంకమ్మ పాల్గొన్నారు.


తాగునీటి పైప్‌లైన్ వేసే చోట డ్రైనేజీ నీరు కలవడాన్ని స్వయంగా పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ

వైభవం.. భవుడి 'ధ్వజారోహణం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి దక్షిణ కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం భవుడి ధ్వజారోహణం అత్యంత వైభవంగా సాగింది. భక్తులు సమర్పించిన చీరలతో స్వామివారి ధ్వజస్తంభం వద్ద ధ్వజం ఎగుర వేసి ముక్కోటి దేవతలను శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ ఘట్టాన్ని కొడి అంటారు. ధ్వజారోహణం పూర్తయిన తరువాత స్వర్ణముఖి నదీ జలాలతో త్రిశూలాన్ని శుద్ధి చేశారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు భక్తకన్నప్ప ధ్వజారోహణంతో అంకురార్పణ జరిగిన సంగతి తెలిసిందే. రెండవ రోజున శ్రీకాళహస్తీశ్వరునికి ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి గర్భాలయానికి ముందు భాగాన ఉన్న ధ్వజస్తంభం వద్ద గంగాభవానీ సమేత పరమశివుడు, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచారు. ఈ ఉత్సవ మూర్తులను దివ్యాభరణాలతో అలంకరించారు. ఆలయ పురోహితులు, అధికారులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణానికి పూజా ద్రవ్యాలను అందజేశారు. ఇక ధ్వజారోహణానికి అవసరమైన పూజా సామాగ్రిని, సారెను ఉభయదారులు అందజేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధ్వజారోహణం తిలకించడానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి బాపి రెడ్డి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బందమ్మ తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ముక్కంటి ఆలయంలో స్వామి వారి ధ్వజారోహణం కార్యక్రమం పూర్తయిన తరువాత గంగాభవానీ సమేత పరమేశ్వరుడు ఒక వెండి అంబారీపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మరో వెండి అంబారీపై అధిష్టించి పురవిహారం చేశారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖధికారి కెవిఎన్ కుమార్ అన్నారు. స్థానిక సరస్వతి బాయ్ పురపాలక ఉన్నత పాఠాశాలలో జరుగుతున్న గైడ్ కెప్టెన్ల శిక్షణా శిబిరాన్ని శనివారం అయన సందర్శించారు. అనంతరం స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ మౌంట్ బేడన్ పావెల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో లీడర్ ట్రైనర్ శకుంతలమ్మ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. కుప్పిరెడ్డి, అసిస్టెంట్ ట్రైనర్ ధనలక్ష్మి, ఎంఈఓ భువనేశ్వరి, కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం. జయరామ, మహేంద్ర, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



టెంపుల్ మహాకుంభ్ లక్ష్యం

ఆదాయమే పరమావధి

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి తాము ఏపని చేసినా ఆదాయమే పరమావధిలా పాలకుల వ్యవహారశైలి ఉంది. అభివృద్ధిని అటకెక్కించి, సంక్షేమాన్ని గాలికొదిలేశారు. కేంద్రంలోని మనువాద ప్రభుత్వం ఆఖరికి ఆలయాలను కూడా ఆదాయ వనరుగా చూస్తూ డబ్బే ధ్యేయంగా మసులుతుండడం గమనార్హం. అందుకు నిదర్శనమే ఇటీవల తిరుపతిలో మూడు రోజుల పాటు జరిగిన టెంపుల్ కనక్టివీటి ఎక్స్‌పో-2025.

తిరుపతి కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ దేవాలయాల సదస్సు (టెంపుల్ కనక్టవటి ఎక్స్‌పో-2025) దేవాలయాల మహాకుంభ్ పేరుతో ఫిబ్రవరి 17 నుంచి 19వ తేది వరకు మూడు రోజుల పాటు నిర్వహించారు. ఇందులో 58 దేశాల నుంచి 1581 ప్రతినిధులు, 111 మందికిపైగా ప్రసంగకులు, 15 వర్క్‌షాపులు, 60స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆలయాలను డిజిటిలైజేషన్ చేయడం ద్వారా స్మార్ట్ మేనేజ్‌మెంట్ వ్యూహాలను అమలు చేయడం, ఆధ్యాత్మికత, సంప్రదాయం, సహజ అభివృద్ధి, శక్తివంతమైన కేంద్రాలుగా ఉండేలా చూడడం ఉద్దేశంగా సదస్సు పెట్టారు. దీనికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నావీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి రోజు సెషన్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చివరి రోజు రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్, మరో మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. సనాతన ధర్మాన్ని తానే కాపాడతానని భుజానికి ఎత్తుకున్న జనసేనాధిపతి అటుపక్కకు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దేశంలోని ఆలయాలన్నింటినీ ఒక గొడుకు కిందకు తెచ్చి వాటి నిర్వహణ బాధ్యత అంతా ఒకరే పర్యవేక్షించేలా చేసి, వాటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్నదే లక్ష్యంగా సదస్సు సాగింది. ఆలయ ఆర్థిక వ్యవస్థను మరో స్థాయికి తీసుకెళ్లడంతో పాటుగా, సనాతన ధర్మం అభివృద్ధి చెందేలా చూసుకోవడం, యువతను చైతన్య పరచడం అనే ప్రసంగాలతో సదస్సు జరిగింది. సదస్సు మొత్తం చంద్రబాబు పక్కా వ్యూహం ప్రకారం తాను, తమ కుమారుడికి మాత్రమే అవకాశం వచ్చేలా చేయడంలో చక్రం తిప్పారు. ఈ సదస్సు ద్వారా సుమారు 2 లక్షల కోట్ల రూపాయల పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల వర్గానికి అప్పజెప్పే ప్రయత్నం సాగిందని, సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా అనుభవం ఉన్న కేంద్ర మాజీ మంత్రి డాక్టరు చింతామోహన్ బహిరంగంగా విమర్శించారు. దీనిపై అటు బిజెపిగానీ, ఇటు టిడిపి గాని స్పందించలేదు, కనీసం ఖండన కూడా చేయకపోవడం గమనార్హం. వాస్తవానికి ఉత్తర భారతదేశంలో పట్టు సాధించిన మనువాదులు దక్షణ భారతదేశంపై కన్నేసి సఫలం కాలేకపోయారు. తమిళనాట చతికిలపడ్డారు. కేరళీయుల వద్ద వారి ఆటలు సాగలేదు. కర్ణాటకలో అడపదడపా పర్వాలేదనిపిస్తున్నారు. ఇకపోతే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వారికి సరైనే మార్గం దొరకలేదు. ఎట్టకేలకు ప్రస్తుతం తెలంగాణలో ఓ మోస్తరుగా రాణిస్తున్నా, ఏపిలో వారికి పైచేయి దక్కడం కష్టమనే భావన అందరికి తెలిసిన సత్యం. ఎలాగైనా ఇక్కడ తమ ఆధిపత్యం చెలాయించాలని, అందుకు ఆధ్యాత్మికమే ఆధారం అని భావించినట్లున్నారు.

అందులో భాగంగానే గత నెలలో ఏకంగా వైద్యులను పావులుగా ఉపయోగించి, వారి చేత ఆధ్యాత్మికతను బోధించేలా వ్యూహాత్మకంగా ఆరోగ్య యోగాయాత్రను తిరుపతి కేంద్రంగా ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా ప్రస్తుతం మహాకుంభ్ పేరుతో ఇంటర్నేషనల్ టెంపుల్ కనెక్టీవిటి ఎక్స్‌పో పేరుతో అంతర్జాతీయ సదస్సును తిరుపతిలో నిర్వహించి, ఆరువేల మందికిపైగా శ్రీవారి దర్శనాలను కల్పించడంలో సఫలకృతమయ్యారు. 'ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో అనేది ఆర్‌ఎస్‌ఎస్ విజన్‌తో నడుస్తుంది. భక్తిభావాలను ధార్మిక కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఎస్ ఆశీర్వాదంతో విస్తరింపజేస్తూ ముందుకు తీసుకెళుతున్నాం' అని విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా నిర్వాహకులు ప్రసాద్‌లాడ్ స్పందించారు. నిపుణులు, మేదావివర్గానికి నిలయమైన తిరుపతిలో 'అన్నింటిని గమనిస్తున్నాం, అందర్నీ ఐక్యం చేసి గళం విప్పుతాం' అని అభ్యుదయ వాదులు అంటుండటం గమనార్హం.

సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ కావేరి తిరుమలయ్య

ప్రజాశక్తి-ఏర్పేడు: జిల్లా అధికారులతో ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఏర్పేడు మండల జడ్పీటీసీ డా.కావేరి తిరుమలయ్య డిమాండ్ చేశారు. జిల్లా ప్రజా పరిషత్ పాలక మండలి ఏర్పాటు అయినప్పటినుండి ఇప్పటి వరకు జరిగిన సర్వ సభ్య సమావేశం, స్థాయి సంఘ సమావేశాలలో జిలా ఉన్నత స్థాయి అధికారులు హాజరవ్వడం లేదని ఆయన అన్నారు. ప్రతి సమావేశంలో ఏదో సాకు చెప్పి హాజరైన అధికార్లు వెళ్లిపోతున్నారన్నారు. దీనికి స్పందించిన జెడ్పీ చైర్మన్, జెడ్పీ సీఈఓ త్వరలోనే జిల్లా కలెక్టర్‌ని సంప్రదించి ఆయన అనుమతి తీసుకుని, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. పాపానాయుడుపేట నుండి చెల్లూరు రోడ్డు నాబార్డ్ ఫండ్ కేటాయించాలని కావేరి తిరుమలయ్య జడ్పీ స్థాయి సంఘ సమావేశంలో కోరారు. రోడ్లు, భవనాల శాఖ అధికార్లు ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని చెప్పారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్పి


గుడిమల్లం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు


ప్రజాశక్తి - ఏర్పేడు: గుడిమల్లం మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, ఏర్పేడు సిఐ ఎస్ జయచంద్రలు కలిసి శనివారం పరిశీలించారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తెగిరి నాయుడు, ఈఓ రామచంద్ర రెడ్డిలను ఉత్సవ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పద్మారావు నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తడి - పొడి చెత్తపై అవగాహన


తడి-పొడి చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ అధికారులు శనివారం చెత్త నుండి సంపద తయారీపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏర్పేడు, ఆమందూరు, చింతలపాలెం, చిందేపల్లి మొదలగు 40 గ్రామ పంచాయతీలలో పంచాయతీ అధికారులు గ్రీన్ అంబాసిడర్‌తో కలిసి గ్రామ ప్రజలకు తడి-పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

హైమాక్స్ విద్యుత్ దీపాలు ఏర్పాటు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తిరుపతి - చెన్నై జాతీయ రహదారి, కదిరిమంగళం కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరుగుతోంది. రాత్రివేళల్లో రోడ్డు దాటడానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి పక్కన దీపాలు ఏర్పాటు చేయాలని వడమాలపేట ప్రజలు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి రహదారిపై హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు సహకరించాలని, ఎస్ ఈ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఎస్ హెచ్ సిబ్బంది లైట్ ఏర్పాటు చేయగా అందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వడమాలపేట విద్యుత్‌శాఖ వారు సమకూర్చారు. ఎమ్మెల్యే స్పందనపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మాతృభాష మన వారసత్వ సంపద


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎన్ చెన్నారెడ్డి ప్రిన్సిపాల్ వీరయ్య మాట్లాడుతూ అమ్మ మాట్లాడే భాషను శిశువు అనుకరించి అనుభవించి ఆనందిస్తాడని, అందుకే అమ్మ భాషను మాతృభాషగా అన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ సదస్సులో కొన్ని తీర్మానాలు చేశారు. ఈ సభలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ పూజారి వెంకటేష్, డాక్టర్ మస్తాన నరసింహులు, డాక్టర్ పి సుజనా, టి.నరసింహులు, డాక్టర్ వి.హరిబాబు, ఎ.నాగేశ్వరరావు, సావిత్రి, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సరస్వతి తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్లం ప్రపంచ భాష


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: స్థానిక ఎన్వీ ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆంగ్లం-ప్రపంచ భాష అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ఎల్.టి. శంకర శర్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల శాఖ విభాగాధిపతి డాక్టర్ వాసన్న మాట్లాడుతూ ఆంగ్లం ప్రపంచ విద్యలో ప్రధాన భాషగా ఉందని తెలిపారు. కళాశాల ఆంగ్ల శాఖ అధిపతి ఈ.సునీత మాట్లాడుతూ ఆంగ్లం ప్రపంచ, వ్యాపార విద్య సాంస్కృతిక కలయికగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విక్టోరియా రాణి, ఐ.క్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రాజా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలి


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచించారు. గూడూరు పట్టణం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల ప్రజలు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం శాంతినగర్ ప్రాంతానికి చెందిన కొత్తపల్లి రమణయ్యకు రూ.50 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు.

ఘనంగా శ్రీ వివేకానంద వార్షికోత్సవ వేడుకలు


సమావేశంలో ఎమెల్యే పాశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు వివేకానంద పాఠశాల48వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులను సినీనటి గీత సింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సినీ నటి గీత సింగ్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ఎంతో చక్కగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలయాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని ఈ బీసీ కాలనీలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను విద్యాశాఖ అధికారులు శనివారం కలిసి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పాలని కోరారు. వారికి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి కె వెంకటసుబ్బయ్య, కనమనంబేడు, సిర్రాకోట, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకులో భారీ దోపిడీ

- నగలను కొల్లగొట్టి రూ.2.35 కోట్లు దోపిడీ
- బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ చేతివాటం
- బ్యాంక్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో భారీ దోపిడీ జరిగింది. ఈ బ్యాంకులో ప్రజలు బ్యాంకులో తాకట్టు పెట్టిన నగలపై అదే బ్యాంకులో పని చేసే అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ కన్నేశాడు. బ్యాంకు లాకర్ లోని 37 బ్యాగుల నగలను మొదటగా తీసుకెళ్లి తన స్నేహితుల ద్వారా మళ్లీ అదే బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.1.31 కోట్లు దోచుకున్నారు. రెండవసారి 30 బ్యాగుల నగలను తీసుకెళ్లి వేరే ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రూ.1.04 కోట్లను కాజేశాడు. గతవారం ఈ సమాచారం వెలుగులోకి రావడంతో బ్యాంకు ఉన్నతాధికారులు బ్యాంకులో ఆడిట్ నిర్వహించి వివరాలు సేకరించారు. ఈ ఆడిట్ ద్వారా దోపిడి నిజమని నిర్ధారణ కావడంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజీఎం ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ మేనేజర్ సూర్య తేజ, మేనేజరు రాజ్ కుమార్‌లపై శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగలాపురం ఎస్‌ఐ వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలో పలు ప్రాంతాలలో ఉచిత ఇసుక పాలసీ పేరుతో ఇసుక మాఫియా రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకు దోచుకుంటున్నారు. స్వర్ణముఖి నదీ పరివాహాన్ని తన సొంత సొత్తు లాగా, ఇసుక తోడేస్తూ బయట ప్రాంతాలకు తరలించి అటు వ్యవసాయ భూములకు, ఇటు తాగునీటికి కరువు ఏర్పడే విధంగా పరిస్తితి ఉంది. ఇసుక మాఫియా ఆగడాలు ఎక్కువ అవడంతో గత కొన్ని నెలలుగా పలు గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ, ఫలితం కనిపించిన దాఖలాలు లేదు. ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం పెళ్లకూరు మండలం ఎస్పై నాగరాజు చొరవతో దిగుచావాలి, పెన్నేపల్లి గ్రామాల వద్ద ఇసుక తరలిస్తున్న ప్రాంతాల్లో గాడిని తీసి ప్రస్తుతానికి అడ్డుకట్ట వేశారు. ఈ అక్రమ రవాణాను ఇలానే అడ్డుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నారు. ఈ అడ్డుకట్ట తాత్కాలికమా లేదా వేచి చూడాలి.

ఎస్వీయూ దూరవిద్య పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ దూర విద్య పరీక్షలను ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేయడం జరిగింది. ఎస్వీయూ దూర విద్య పరీక్షలను ఫిబ్రవరి 24 నుంచి మార్చి15 వరకు జరగాల్సిన పరీక్షలను రాష్ట్రం లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులు దూరవిద్య పరీక్షలకు హాజరు కాలేమన్న అభ్యర్థన మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య తవమని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

వ్యవసాయ కళాశాలలో క్రీడలు, సాహిత్య పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మూడు రోజులపాటు ఫిబ్రవరి 23 నుండి 25 వరకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సిబ్బందికి క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఇంచార్జీ విసి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమ విచ్చేయనున్నట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ చెరుకూరి శ్రీనివాసరావు పరిశోధన సంచాలకులు డాక్టర్ వి. సుమతి, గెస్ట్ ఆఫ్ హానర్స్‌గా విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వివిధ ప్రాంతాల బోధన సిబ్బంది, వివిధ క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన


డాక్టర్ చందనకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - తడ : శనివారం పాముల మిట్ట ప్రాథమిక పాఠశాలలో చందన మల్టి స్పెషాలిటీ డెంటల్ హెల్త్ సెంటర్, తిరుపతి వారి ఆధ్వర్యంలో ప్రధాన వైద్యులు డాక్టర్ చందన స్రవంతి, వారి బృందం డాక్టర్ కీర్తి పాఠశాల బాలబాలికలకు దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. పిల్లలకు ఉచితంగా పేస్టులు బ్రష్‌లు అందించారు. దంతాలు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున రావు మాట్లాడుతూ వైద్య బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మునిరాజా, పాఠశాల హెడ్మాస్టర్ షేక్ ఉస్మాన్ భాష, సి ఆర్ పీ గోపినాథ్, గ్రామ పెద్దలు సుబ్రమణ్యం రెడ్డి, చిరంజీవి రెడ్డిలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి


మృతి చెందిన షేక్ ఖలీల్ భాషా

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, దొడ్ల వారి మిట్టవద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధ రాత్రి నాయుడుపేట మండలం మాలయకోట ప్రాంతానికి చెందిన షేక్ ఖలీల్ భాషా (36) శ్రీకాళహస్తికి తన సొంత పనుల నిమిత్తం వెళ్లి, తిరుగు ప్రయాణంలో గుర్తు తెలియక నాయుడుపేట బైపాస్ అనుకుని వాహనం దిగి దారి తప్పాడు. దొడ్లవారిమిట్ట గ్రామ జాతీయ రహదారి వద్ద తనది ఆ ప్రాంతం కాకపోవడంతో నాయుడుపేట వైపు నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు పోలీసులు మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి పంపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి


మృతి చెందిన లారీ డ్రైవర్ సౌందర్య రాజు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం పాత జాతీయ రహదారిలో కాశి పెంట్ల వద్ద లారీల మధ్య ఇరుక్కుని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి లారీ పార్కింగ్ చేసి దిగు తున్న డ్రైవర్‌ను మరో లారీ పక్కగా వెళుతూ ఢీ కొనటంతో వాహనాల మధ్య అతను ఇరుక్కుపోయాడు. ఫుట్ పాత్‌కు అమర్చిన గ్రిల్స్ కడుపులోకి చొచ్చుకెళ్లి తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం వరకు ఎవరూ గుర్తించక పోవడంతో అధిక రక్తస్రామై డ్రైవర్ మృతి చెందాడు. మృతుడు తవణంపల్లి మండలం, మారేడు పల్లికి చెందిన సౌందర్య రాజు (35) గా గుర్తించారు. చంద్రగిరి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.

జ్ఞాన జ్యోతి అంగన్వాడి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : అంగనవాడి కార్యకర్త జ్ఞాన జ్యోతిగా పిల్లల జీవితంలో మెరుగులు దిద్దాలని మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, రెండవ విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 రోజులు ధృవపత్రాల శిక్షణ తరగతులు ప్రధానోపాధ్యాయుడు కె. రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. అంగన్వాడీలకు డి.ఆర్.పి లు పవిత్ర, శివశంకర్, రమేష్‌లు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ యమున, జ్యోతిపాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ ముని సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని కనమనంబేడు, బుచ్చిరాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రైతులు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -కోట : ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నిరంజన్ కుమార్ అన్నారు. శనివారం కోట మండలంలోని చిట్టేడు, కేశవరం గ్రామాల రైతు సేవా కేంద్రాలలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్, విఏఏ, వి ఆర్ ఓలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం


సమావేశంలో ఎంఈవో ప్రేమలత, డాక్టర్ మధురిమ

ప్రజాశక్తి- ఏర్పేడు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా చుట్టుపక్క గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా నిర్మూలించాలనే ఉద్దేశంతో శనివారం పాపానాయుడుపేటలో బాల్య వివాహాల నిర్మూలనకై ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏంఈఓ ప్రేమలత, డాక్టర్ మధురిమలు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్థాలను వివరించారు. గురించి మరియు ప్రతి విద్యార్థి ఈ బాల్యవివాహం అనే ఉచ్చులో పడకుండా చదువుకోవాలని తెలియచేసారు. ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణ, సర్పంచ్ లలితా కరుణాకర్, ఎంఎస్ కె నాగలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, ప్రగతి సంస్థ ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ మంజుష తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి శనివారం ప్రకటనలో తెలిపారు. మార్చి 20వ తేదీ లోపల ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పాఠశాలల వాహనాలు తనిఖీ


బస్సులను తనిఖీ చేస్తున్న విశ్వనాథ నాయుడు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను శనివారం ఉదయం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు తనిఖీ చేశారు. డ్రైవర్లకు అనుభవం ఉందా? లైసెన్స్‌లు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. వాహనాల కండిషన్‌ను పరిశీలించారు. అనంతరం డ్రైవర్లకు విద్యార్థులను తీసుకువెళ్లేపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

రేపు అన్న చెరువుకు వేలంపాట

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీలో ఉన్న అన్న చెరువుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే ఈ వేలం పాటకు ఔత్సాహికులు పాల్గొనవచ్చునని తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


బహుమతి ప్రదానం చేస్తున్న కృష్ణ

ప్రజాశక్తి - బాలాయపల్లి: జయంపులో పుట్టి, అక్కడి పాఠశాలలో చదువుకుని, ఆ పాఠశాలకే సైన్స్ మాస్టర్‌గా సేవలందించి, సినీ రంగంలో కవిగా ప్రవేశించి ఎంతో స్థాయికి ఎదిగిన కృష్ణ తను చదువుకున్న పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆయన గ్రామానికి దూరంగా ఉన్నా, తన ఊరు, పాఠశాలపై ఉన్న మమకారంతో గత 15 సంవత్సరాలుగా పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌పై దృష్టి పెట్టక చదువులో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, బ్యాంకు మేనేజర్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని కట్టడి చేద్దాం


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : క్షయ వ్యాధి నిర్మూలనకు అందరికీ ఆ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని సూపర్వైజర్ రమణ అన్నారు. శనివారం ఆయన దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వేణుంబాకం గ్రామ ప్రజలకు క్షయ వ్యాధి లక్షణాలు, ఆ వ్యాధి దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. మార్చి 24 ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా, ఫిబ్రవరి 17 నుండి 23 వరకు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. ప్రభుత్వ క్షయ వ్యాధి బారిన పడినవారికి నెలకు 1000 రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పావని, సచివాలయ ఏఎన్‌ఎం అమరావతి, ఆశ వాలంటీర్‌లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాయుడుపేట: మార్చ్ 24 ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాయుడుపేట, డిగ్రీ కాలేజ్‌లో టీబి మెడికల్ సూపర్వైజర్ రమణయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేట టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వికాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం అమరావతి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, వీఎస్సార్ ఇంగ్లీషు మీడియం పాఠశాల వార్షిక క్రీడోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ మునిగిరీష్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణం రాజు, మునిగిరీష్‌లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనుల ప్రారంభంలో ఇళంగోవన్ రెడ్డి

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటురు టీచర్స్ కాలనీలో 7.5 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు పనులు క్లస్టర్ ఇంచార్జి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఇళంగోవన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సిమెంట్ రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ప్రభుత్వం మారిన తర్వాత, ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో సిమెంట్ రోడ్లు మంజూరయ్యాన్నారు. ఈ కార్యక్రమంలో డిల్లీ, సుగందర్, శ్రీనివాసులు, వేదలు పాల్గొన్నారు.

మున్సిపల్ సెప్టిక్ ట్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా నాయుడుపేట మున్సిపాలిటీకి మంజూరు చేసిన సెప్టిక్ ట్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్కువ ఖర్చుతో సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసుకునేందుకు మునిసిపాలిటీకి ఒక క్లీనింగ్ వాహనాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్‌కి అధిక మొత్తం చెల్లించలేని వారికీ ఇది చాలా ఉపయోగకరమన్నారు. దీన్నీ ఉపయోగించుకునేందుకు మునిసిపాలిటీకి ఒక ట్రిప్పుకు రెండువేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైనవారు 9963553043 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

న్యాయవాది శ్రీధర్ సంస్మరణ సభ


న్యాయవాది శ్రీధర్ విగ్రహాన్ని, ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త కెఎస్ శ్రీధర్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణ సభను శనివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆయన కుటుంబ సభ్యులు కెఎస్ వాసు, కెఎస్ రవి, శ్రీలత నిర్వహించారు. ఈ సంస్మరణ సభా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్, గౌరవ అతిథిగా అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత డైరెక్టర్ మేడసాని మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, తన తండ్రి జీవిత చరిత్రపై కెఎస్ వాసు రాసిన " ది మ్యాన్ విత్ అవుట్ మ్యాజిక్ వాన్డ్" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్ సతీమణి సుమిత్ర, సీనియర్ న్యాయవాది దొరైరాజు, గోపాలకృష్ణమాచారి, జిల్లా గౌరవ న్యాయమూర్తి సీఎం గురునాథ్, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు గల్లా సుదర్శన్, తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీచంద్, కోమండూర్ విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందం శ్రీధర్ విగ్రహానికి నివాళులర్పించారు.

'నా ఎన్నికను జీర్ణించుకోలేకే ఆరోపణలు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):వైసీపీలో స్వేచ్ఛలేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంతమంది కార్పొరేటర్లు కూటమి అభ్యర్థిగా ఉన్న తనను డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో గెలిపించారని, ఇది జీర్ణించుకోలేక మాజీ డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి నిందారోపణలు చేస్తున్నారని డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ రెడ్డి 2007లో టీటీడీ చైర్మన్‌గా తనకంటే ముందు ఓ బోర్డు సభ్యుని చేత ప్రమాణ స్వీకారం చేయించినందుకు, ఓ అధికారిని బాధ్యతలు నుండి తప్పించిన విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. మేయర్ శిరీషకు చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను కూడా వివరించకుండా, తండ్రి కొడుకులే అన్ని తామై నడిపించారన్నారు. కార్పొరేటర్ శేఖర్ రెడ్డి అక్రమ కట్టడం కూల్చడానికి అధికారులు వెళితే మేయర్ హోదాలో ఉన్న వ్యక్తి ధర్నా చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు సుబ్బు యాదవ్, శ్రీధర్, నాగప్రతాప్, సుధాకర్ రెడ్డి, దేవా, జగ్గా, రవితేజ నాయుడు పాల్గొన్నారు.

పేదలకు గృహాల మంజూరే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం :నిరుపేదలందరికీ నివాసయోగ్యమైన పక్కా గృహాలు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. దొరవారి సత్రం మండల పరిషత్ కార్యాల యంలో శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల హౌసింగ్, సచివాలయ సిబ్బంది, మండల పార్టీ కన్వీనర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇంటి నివేశ స్థలాలకు 3 సెంట్లు, అర్బన్ ఏరియాలో 2 సెంట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్‌లో వస్తున్న రెవిన్యూ సంబంధం ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని తాసిల్దార్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శైల కుమారి, మండల ఉప అధ్యక్షులు గోపాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, నాయకులు ఉదయ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీవో గోవర్ధన్, ఆరు మండలాల హౌసింగ్ శాఖ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి భార్యకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నేతల సిఫార్సు ఉంటే చాలు 'తిమ్మిని బమ్మిని.. బమ్మిని తిమ్మిని' చేసేస్తారు ప్రభుత్వ అధికారులు. అర్హత లేకున్నా ఓ ప్రభుత్వ ఉద్యోగి భార్యకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అందించేశారు. భర్త బతికుండగానే ఆ మెకు ఒంటరి మహిళ పెన్షన్ అందిస్తుండటం కొసమెరుపు. వివరాల్లోకి పోతే పట్టణ పరిధిలోని 9వ వార్డుకు చెందిన పార్వతీదేవి మహిళా సమాఖ్య సభ్యురాలు ఓ అగ్ర కులానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి భార్య. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ సభ్యులు ప్రభుత్వం అందించే ఏ సంక్షేమ పథకానికైనా అనర్హులు. అలాంటిది మన ప్రభుత్వ అధికారులు పెద్ద మనస్సు చేసుకుని ఆర్టీసీ ఉద్యోగి భార్యకు అన్ని రకాల సంక్షేమ పథకాలను ఏ మాత్రం ఆలోచించకుండా అందిస్తున్నారు. చివరకు భర్త ఉన్నా కూడా ఒంటరి మహిళ పేరిట పెన్షన్ నగదును ఏకంగా ఇంటికే వెళ్లి అందిస్తూ ప్రజా సొమ్మును దుర్వినియోగపరుస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి ప్రజాధనం వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్యలోని పలువురు మహిళలు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య వైన్ షాపు.. ప్రజాగ్రహం.!

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్, లింగేశ్వర నగర్ పంచాయతీ పరిదిలో నివాసాల మధ్య వైన్ షాప్ ఏర్పాటును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శనివారం వైన్ షాప్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్మాణం వద్ద స్థానికులు, మహిళలు కలసి ఏర్పాటును అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న లింగేశ్వర నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి స్థానికులకు మద్దతుగా నిలబడ్డారు. నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మంత్రి పెందుర్తికి ఎంజీఎం ఆహ్వానం


మంత్రిని అహ్వానిస్తున్న ఎంజీఎం అధినేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తికి రావాలని రాష్ట్ర మంత్రి పెందుర్తి వెంకటేష్‌కు ఎంజీఎం సంస్థల అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌లు ఆహ్వానం పలికారు. సీఎం శ్రీకాళహస్తి పర్యటనా ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రి శనివారం శ్రీకాళహస్తికి వచ్చారు. ఆయనకు ఎంజీఎం తరపున స్వాగతం పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు.

తడి-పొడి చెత్త పై గ్రామ ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - తడ :తడ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం యస్ డబ్ల్యూ పీసిషెడ్‌కు సంబంధించి గ్రామ ప్రజలకు యంపిడీఓ విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. క్లాప్ మిత్రులకు చెత్త ఇవ్వాలని సూచించారు. తడి చెత్తతో ఇళ్లవద్దనే వర్మి కంపోస్టు తయారు చేసుకోవచ్చని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - చంద్రగిరి: కంప్యూ టర్ పరిజ్ఞానంపై విద్యా ర్థులు అవగాహన పెంచుకో వాల్సిన అవసరం ఉందని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఆచార్య లావణ్య పేర్కొన్నారు. తిరుమలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో శ్రీ విద్యానికేతన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ డాక్టర్ జె.అవనిజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రధాని అమెరికా వెళ్లింది అదాని ప్రయోజనాల కోసమే : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రధాని అమెరికాకు వెళ్ళింది కేవలం ఆదానీ ప్రయోజనా లను కాపాడేందుకేనని సిపి ఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీవ్రంగా విమర్శిం చారు. శనివారం స్థానిక బైరాగి పట్టెడ సిపిఐ కార్యాలయంలో తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశం ఎ.చిన్ని రాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు హరినాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు పని చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. బిజెపి బడ్జెట్‌ను వ్యతిరేకించలేని చంద్ర బాబు రాష్ట్ర అభివృద్ధిని ఎలా సాధిస్తాడో ప్రజలకు చెప్పాలన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ బాడుగ ఇళ్ళలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాస్పోర్ట్ పోయినది

పెన్నెబెత్తిన రాజేష్ తండ్రి గోపాలయ్య, డోర్ నెం.3-53, చిల్లకూరు విలేజ్, జీలపాటూరు పోస్టు, పెళ్ళకూరు మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ యందు నివసించుచున్నాను. 01.02.2025వ తేది నేను నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులో చిల్లకూరుకు వెళుతుండగా బస్సులో పాసుపోర్టు నెం. K4737785 పోయినది ఎవరికైనా దొరికినచో క్రింద తెలిపిన నెంబరుకు తెలియపరచగలరు. సెల్:93467 55389

IN THE COURT OF THE CHIEF JUDICIAL MAGISTRATE, VELLORE, Tamil Nadu
MCOP No.65/2022

Ponmozhi, W/o. Babu. ....Petitioner
Vs
Ranga Venu, S/o. V. Venu,
Residing at No.10-13-569,
Reddy and Reddy Colony,
Tirupathi Urban,
Andhra Pradesh ....Respondent

NOTICE TO 1ST RESPONDENT

The above petitioner in the above MCOP case claiming compensation from the Respondent No. 1 of you. If any objection from your side you or your counsel may attend before the Hon'ble Chief Judicial Magistrate, Vellore 632009 on **21.03.2025 at 10.00 A.M**. It is further informed, that if not, the case will be decided as Ex-Parte.

N. SANKAR, Advocate, Sathuvachari, VELLORE 632 009.

వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - చంద్రగిరి :

శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శనివారం ఉదయం 8 గంటలకు స్వామివారు మోహినీ అలంకారంలో నాలుగు మాడ వీధుల్లో విహరించారు. రాత్రి 7 గంటల నుండి గరుడ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. వాహనసేవలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ ప్రత్యేకాధికారి మరియు సిపిఆర్వో డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్ వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి గరుడ సేవ సందర్భంగా శనివారం సాయంత్రం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధా రెడ్డి హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు





సమర్పించారు. తుమ్మలగుంట, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నుంచి, శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో డ్రోన్ పిచికారీ



ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు చంద్రగిరి మండలంలోని నారావారిపల్లి, భీమవరం, కొంగరవారిపల్లి గ్రామాలలో వ్యవసాయ డ్రోన్స్ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో జీవామృతం పిచికారీపై అవగాహన కల్పించారు. వరి , మామిడిలో పిచికారీ ప్రదర్శన నిర్వహించినట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా ఎస్. శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం మేనేజర్ షణ్ముగం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆహారం పండించడంలో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయంలో నూతన సాంకేతికత వినియోగించటం వలన రైతులకు శ్రమ తగ్గి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. కూలీల కొరతకు ఇది ప్రత్యామ్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాము కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రతి రైతు రైతు సేవ కేంద్రంలో గుర్తిపు కార్డుకోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాష శనివారం తెలిపారు. ఫిబ్రవరి 25 తేదీ లోపల అర్హత కలిగిన ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో పేర్కొన్నారు.

బాల్యవివాహాలు నిషేధిద్దాం



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ అధ్యక్షతన శనివారం బాల్యవివాహాలను నిషేధించాలని గోడపత్రాలను ఆవిష్కరించారు. శివరాత్రి సందర్భంగా ఎవరైనా బాల్య వివాహాలకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం నాయకులు చందమామల కోటయ్య, దశరథరామయ్య, రూప సంస్థ రమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ స్కౌట్స్ డే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక కామరాజు నగర్, స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు "రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బేడెన్ పోవెల్" జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గేటు పుత్తూరు, పురవీధుల నుండి బయలుదేరి కార్వేటినగరం కూడలి బజార్ స్ట్రీట్, తిరుపతి రోడ్డు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ రాధిక, రోవర్ లీడర్ జై కుమార్, గైడ్స్ లీడర్ యువ శ్రీ, జోష్న, చార్మి, భాను, స్కౌట్ మాస్టర్ అశోక్ కుమార్ గజరాజన్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ బివిఎస్సి, ఏహెచ్, ఎంవిఎస్సి, పిహెచ్డి విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ యూనివర్సిటీ అంబేద్కర్ విగ్రహం ఎదుట వెటర్నరీ విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, వెటర్నరీ వర్సిటీ విద్యార్థులు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా స్టైఫండ్ పెంచకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పశు వైద్య విద్యార్థులకు న్యాయమైన కోరికలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర నాయక్, యూనివర్సిటీ నాయకులు ఉదయ్ కిరణ్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనాథలకు అల్పాహారం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, ఖాది కాలనీలో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి ఆధ్వర్యంలో అనాథలకు, ఏ ఆసరా లేని, అంగవైకల్యం గల సుమారు 200 మందికి అల్పాహారం, మినరల్ వాటర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవలో భాగంగా తిరుపతిలోని వివిధ కాలనీలలో గల అనాథలకు, బిక్షగాళ్లకు ఉదయం అల్పాహారం అందజేయడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, సభ్యులు బాసికర్ల రఘు, శాంతి, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డులు పొందండి

ప్రజాశక్తి - రామచంద్రపురం :మండలంలోని రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు కార్డులు పొందేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసిల్దార్ కే వెంకటరమణ సూచించారు. శనివారం మండలంలోని సొరకాయల పాళ్యం గ్రామంలో నిర్వహిస్తున్న రైతు డిజిటల్ గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ యోజన పథకం లబ్ధిదారులందరకీ విశిష్ట గుర్తింపు కార్డు నమోదు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ అమృత, వీఆర్వో ప్రదీప్ నాయుడు, వ్యవసాయ శాఖ సచివాలయ అసిస్టెంట్లు కార్తీక్, ఢిల్లీ రాణి, సిబ్బంది పాల్గొన్నారు

భూత వాహనంపై భోళాశంకరుని వైభవం



ప్రజాశక్తి - నాగలాపురం:నాగలాపురం మండలం, సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజైన శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు భూత వాహనంపై శ్రీ భోళా శంకరుని, పల్లకి వాహనంలో శ్రీ పార్వతీ దేవిని ఊరేగించారు. శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ లత, దండపాణి, పరంధాం, సిబ్బంది పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :తిరుమల శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర శనివారం వైభవంగా జరిగింది. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం నుండి శోభాయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడ సేవను పురస్కరించుకుని ఈ హారాన్ని స్వామివారికి అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యుడు జి.భానుప్రకాశ్ రెడ్డి, సివిఎస్వో మణికంఠ చందోలు, డిఎల్వో వరప్రసాద్ రావు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మీ, విజివో సదాలక్ష్మీ , ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై పుస్తకాన్ని ఆవిష్కరించిన టిటిడి జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీ కపిలేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ రచించిన శ్రీ కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనే పుస్తకాన్ని శనివారం టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నకు టిటిడి పట్టు వస్త్రాలు సమర్పణ



ప్రజాశక్తి - తిరుమల: శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తరపున టీటీడీ ఈవో జె.శ్యామలరావు శనివారం సాయంత్రం పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా టిటిడి ఈవో మాట్లాడుతూ, శ్రీశైలంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శ్రీశైలంతోపాటు వేములవాడ, శ్రీకాళహస్తి, సురుటుపల్లి, యాగంటి, మహానంది తదితర శైవాలయాలకు టిటిడి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 1996 నుండి టిటిడి తరుపున శ్రీ మల్లికార్జున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నట్లు మాట్లాడారు. ఫిబ్రవరి 19న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఆలయం వద్దకు చేరుకున్న ఈవో జె శ్యామల రావు కు శ్రీశైలం ఆలయ ఈవో ఎం.శ్రీనివాస రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ అధికారులు వీరికి తీర్థ, ప్రసాదాలు అందించారు.

ఘనంగా శివరాత్రి మహోత్సవాలు



ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరుశురామేశ్వర ఆలయంలో మొదటి రోజున ధ్వజారోహనం పెద్ద శేష వాహనం, కల్పన వృక్ష వాహనం మీద స్వామి వారిని ఊరేగించడం జరిగింది. ఉభయ దారులుగా బాలకృష్ణ రెడ్డి, ప్రీతి రెడ్డి మరియు కల్పవృక్ష వాహనం పెద్ద శేషవాహనమునకు నితీషా రెడ్డి, రవీంద్ర సన్నా రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్య నిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించినారు. సాయంత్రం నెల్లూరు కళాకారులచే వీణ కచేరి కార్యక్రమం జరిగింది.